

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం

04 జనవరి 2026 పేజీలు : 08


## విద్యుత్ ట్రూ-అప్ చార్జీలను

# పూర్తిగా రద్దు చేశాం

**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :**

గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజలపై భారం మోపిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను ఈ సంవత్సరం నుంచి తమ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామంలో మంత్రి ఆనం పాత్రికేయులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అస్తవ్యస్త విధానాలతో ప్రజలపై విద్యుత్ చార్జీలతో పాటు ట్రూఅప్‌చార్జీల భారం మోపిందన్నారు. గత ఐదేళ్లలో సుమారు 32,166 వేల కోట్లను ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేసిందన్నారు. ఇక నుంచి ట్రూప్ చార్జీలను ప్రజల నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఒక సంవత్సరానికి మొత్తం రూ.4497 కోట్లను ప్రభుత్వం భరిస్తూ ప్రజల నుంచి వసూలు చేయకుండా రద్దు చేస్తున్నట్లు చెప్పారు విద్యుత్‌శాఖ తిరుపతి రీజియన్ పరిధిలో 1551.69 కోట్ల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఇంత మంచి నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. అలాగే గత ప్రభుత్వం విద్యుత్‌చార్జీలను పెంచుకుంటూ పోతే తమ ప్రభుత్వం ఈ ఏడాదిలో కనీసం యూనిట్‌కు 40 పైసలు తగ్గించాలనే ఆలోచన చేస్తుందన్నారు. ప్రజలకు -మిగతా 6లో

## చంద్రబాబు పాలనలో..

# సుభిక్షంగా ఉన్న రైతులు



- బుచ్చిరెడ్డి పాళెం మండలం రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ
- పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతుల భూములకు భద్రత
- పాస్‌బుక్‌పై గల క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి భూమి వివారాలు తెలుసుకోవచ్చు
- దశాబ్దాల తరబడి పూడికలు తీయని కాలువలను బాగు చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాం
- గతంలో లేనివిధంగా గిట్టుబాటు ధర కల్పించి, 24 గంటల్లో రైతుల ఖాతాలలో డబ్బులు వేశాం
- 5.70 లక్షల నిధులు కాగులపాడు గ్రామాభివృద్ధికి కేటాయించాం
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రాష్ట ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందచేసి ఎన్నికల నాటి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేశారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు అందచేసే కార్యక్రమంలో భాగంగా బుచ్చిరెడ్డి పాళెం మండలం కాగులపాడు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి స్థానిక టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. బుచ్చిరెడ్డి పాళెం మండలానికి చెందిన చల్లాయపాళెం 458, పెనుబల్లి 596, పంచేడు 578, దామరమడుగు 752. జొన్నవాడ 268, కలయ కాగొల్లు 334, శ్రీరంగరాజపురం 133, రేబాల 945, నాగమాంబాపురం 269, మినగల్లు 368 కొత్తగా మంజూరైన 4 వేల 713 పట్టాదార్ -మిగతా 6లో

**మూడు విడతలుగా 7 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసి సన్నకారు రైతులను ఆదుకున్నాం**



## రైతును రాజుగా చూడాలన్నదే

# ప్రభుత్వ లక్ష్యం

- రైతుల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించేందుకే ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నాం
- మంత్రి ఆనం రామనారాయణరెడి




రైతును రాజుగా చూడాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏఎస్‌పేట మండలం హసనాపురం గ్రామంలో పట్టాదారు పాస్ పుస్తకాలను రైతుల ఇంటి వద్దకే వెళ్లి మంత్రి పట్టాలను పంపిణీ చేశారు.

## చంద్రబాబు, లోకేష్‌ల..

# ఆచూకీ ఎక్కడ !



- వారం రోజులుగా అడ్రస్ లేని చంద్రబాబు, లోకేష్
- కనీస సమాచారం లేకుండా విదేశీ పర్యటనలు
- ఆచూకీ చెప్పాలని నిలదీస్తున్న ప్రజలు
- మండిపడ్డ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి
- నెల్లూరు వైయస్సార్సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నెల్లూరు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

రాష్ట్ర ప్రజలకు కనీస సమాచార మివ్వకుండా సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌లు రహస్యంగా విదేశీ పర్యటనలకు వెళ్లడంపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులోని వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తండ్రీ కొడుకుల రహస్య పర్యటనపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే, దాన్నుంచి దృష్టి మరల్చడానికి మళ్లీ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీశారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే పోర్న్ పెట్టుబడులు పేరుతో తండ్రీకొడుకుల కట్టుకథలు ప్రచారం చేస్తూ.. కాగితాలపై రాసుకున్న ప్రతిపాదనలనే -మిగతా 2లో

# చంద్రబాబు, లోకేష్.. ఆచూకీ ఎక్కడ !

*(మొదటి పేజీ తరువాయి)*

పెట్టుబడులుగా చూపించి ప్రజలను మభ్యపెట్టే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైయస్.జగన్ హయాంలో తయారీ, పరిశ్రమల రంగాల్లో రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడంలో దక్షిణాదిలోనే ఏపీ ముందంజలో ఉందని, కూటమి ప్రభుత్వం వచ్చాక పెట్టుబడుల సదస్సులన్నీ ఫార్సుగా మారిపోయాయని తేల్చి చెప్పారు. గతంలో 2014-19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు గిట్టని వారి భూములను 22ఏ జాబితాలో చేర్చి ఎంతోమందికి తీరని వేదన మిగిల్చితే, వైయస్ జగన్ సీఎం అయ్యాక ఆ సమస్యకు పరిష్కారం చూపించారని స్పష్టం చేశారు. హైపర్ లూప్, డ్రోన్ ఇండస్ట్రీ, సెమీకండక్టర్ యూనిట్ ఏర్పాటు పేరుతో ప్రచారం చేసుకున్న.. చంద్రబాబు వీటిలో కనీసం ఒక్కటంటే ఒక్కటీ ఏర్పాటు చేయలేదని, కేవలం ప్రచారం తప్ప.. ఒక్క ప్రాజెక్టూ పట్టాలెక్కలేదని ఫైర్ అయ్యారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

### రహస్యంగా ఉండాల్సిన అవసరం ఏమొచ్చింది ?

పెట్టుబడులు ఆకర్షించడంలో తమకు ఎవరూ సాటిలేరన్నట్టు, తమ ఘనత గురించి ఫోర్బ్స్ ఒక స్టోరీ రాసిందంటూ తండ్రీ కొడుకులు చంద్రబాబు, లోకేష్‌లు సోషల్ మీడియాలో నానా హంగామా చేస్తున్నారు. చంద్రబాబుగారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆయన పెట్టుబడులన్నీ కట్టుకథలే తప్ప ఏ ఒక్కటీ నిజం లేదు. చంద్రబాబు రాష్ట్రంలోనే లేకపోయినా సరే రెవెన్యూ పుస్తకాల ముద్రణ, పంపిణీ గురించి చర్చించినట్టు ఎక్స్‌లో పోస్టులు పెట్టి ప్రజలను డైవర్ట్ చేస్తున్నారు. వారం రోజులుగా లోకేష్, చంద్రబాబు కనిపించడంలేదని సోషల్ మీడియాలో, రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంటే, బాధ్యతగా ఎక్కడున్నారో చెప్పడం మానేసి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. బాధ్యతాయుతమైన రాజ్యాంగ పదవుల్లో ఉండి ఇలా రహస్య ప్రదేశాల నుంచి ట్వీట్లు వేయడం వెనుక ఉద్దేశం ఏమిటి? ఆఖరుకి టీడీపీ అనుకూల మీడియాకి కూడా తండ్రీకొడుకులు ఆచూకీ చెప్పడం లేదంటే ఏదో జరుగుతుందోనన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. మా నాయకులు వైయస్ జగన్ గతంలో తన కుమార్తె గ్రాడ్యుయేషన్ డే కోసం లండన్ వెళ్తున్నట్టు ప్రకటించి వెళ్లినా సరే దాని గురించి ఈ తండ్రీకొడుకులు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. కానీ చంద్రబాబు, లోకేష్ ప్రత్యేక విమానాలో విదేశాలకు వెళ్లి కూడా ఎక్కడున్నారో చెప్పకుండా రహస్య జీవితం గడుపుతున్నారు. అంత రహస్యంగా పర్యటనలు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది.

### అవన్నీ కార్యరూపం దాల్చే పెట్టుబడులేనా ?

వివిధ రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడతామంటూ వచ్చిన ప్రతిపాదనల్లో ఏపీ ముందు వరసలో ఉందనేది ఫోర్బ్స్ పత్రిక కథనం సారాంశం. ఫోర్బ్స్ పత్రిక ఏం రాసిందో చాలా మంది ప్రజలకు తెలియదు కాబట్టి దాన్ని తనకు అనుకూలంగా చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నాడు. కేవలం కాగితాల మీద చేసుకున్న ఎంవోయూల ఆధారంగా రూపొందించిన లెక్కలు చూపించి ఏపీని రూపురేఖలు మార్చేసినట్టు తండ్రీ కొడుకులు డబ్బా కొట్టుకుంటున్నారు. వాస్తవ రూపంలోకి ఎన్ని పరిశ్రమలు తెచ్చారు. మన పిల్లలకు ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయి. అనే వివరాలు మాత్రం చెప్పలేరు. ఎందుకంటే ఏమీ చేయడం లేదు కాబట్టే. చంద్రబాబు చెప్పే పెట్టుబడుల లెక్కలు ఆకాశంలో ఉంటే, వాస్తవాలు అందుకు భిన్నంగా ఉంటాయి. 2014-19 మధ్య గత టీడీపీ హయాంలో భాగస్వామ్య సదస్సుల ద్వారా 1,761 ఒప్పందాల జరిగితే రూ. 18.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు, 30.91లక్షల మందికి ఉపాధి వస్తుందని ఊదరగొట్టారు. కానీ నిజానికి వాటిలో 10 శాతం మాత్రమే కార్యరూపం దాల్చాయి. పరిశ్రమల శాఖ స్వయంగా కుదుర్చుకున్న రూ.7.68 లక్షల కోట్ల విలువైన 327 ఒప్పందాల్లో వాస్తవంగా అమల్లోకి వచ్చినవి 45 మాత్రమే. అంటే కార్యరూపంలోకి వచ్చినవి 13 శాతం లోపే. అలాగే 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో మొత్తం 17 సార్లు ఎస్ఐపీబీ సమావేశాలు జరిగితే అందులో రూ. 1.70 లక్షల కోట్ల విలువైన 91 మెగా ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటిలో అమల్లోకి వచ్చినవి కేవలం 5.69 శాతం మాత్రమే. 2014-19 మధ్య మూడుసార్లు నిర్వహించిన సీఐఐ సదస్సు సహా అనేక సందర్భాల్లో చంద్రబాబు పెట్టుబడులు, పరిశ్రమలపై గొప్పగా ప్రకటనలు చేశారు. వీటిలో ఏ ఒక్కటీ అమలు కార్యరూపం దాల్చలేదు.

### వీటిలో ఒక్కటైనా వచ్చిందా ?

అమరావతి నుంచి విశాఖ నిమిషాల్లో చేరుకునే హైపర్లూప్ అన్నారు. దొనకొండ వద్ద డ్రోన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సుఖోయ్ ఎయిర్‌క్రాఫ్ట్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ కలిపి యూనిట్ ఏర్పాటు అన్నారు. నెక్ట్స్ ఆర్బిట్ వెంచర్స్ ద్వారా సెమీ కండక్టర్ ఫ్యాబ్రికేషన్స్ యూనిట్ అన్నారు. కాకినాడ వద్ద పెట్రో కెమికల్ యూనిట్ వస్తోందని హడావుడి చేశారు. టైటాన్ ఏవియేషన్ విమానాల తయారీ అన్నారు. స్విట్జర్లాండ్‌కి చెందిన ఏరోస్పేస్ వెంచర్స్ రూ.10వేల కోట్ల పెట్టుబడి అన్నారు. ఎయిర్ బస్ అన్నారు, మైక్రోసాఫ్ట్ అన్నారు. బ్లాక్ చైన్ టెక్నాలజీకి విశాఖ కేరాఫ్ అన్నారు. వీటిలో ఏ ఒక్కటీ ఏపీకి రాలేదు.

### వైసీపీ హయాంలో 91.6శాతం కార్యరూపం

వైయస్సార్‌సీపీ హయాంలో 2023 గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో మొత్తం 394 ఒప్పందాలు చేసుకుంటే, రూ.13.15 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని, తద్వారా 6.16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొదటి ఏడాదిలోనే 20శాతం కార్యరూపం దాల్చాయి. అందులో పరిశ్రమల శాఖ ద్వారా 99 ఒప్పందాలు చేసుకుంటే, 91 శాతం స్ట్రైక్ రేటు సాధించాం. ఆ ఒప్పందాలు జరిగిన రెండేళ్లలోపే 90కి పైగా యూనిట్లు నిర్మాణ పనులు ప్రారంభించగా, వాటిలో 39 కంపెనీలు ఇప్పటికే ఉత్పత్తిని కూడా ప్రారంభించి వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పరిశ్రమల శాఖకు సంబంధించి మొత్తం



పెట్టుబడుల్లో 91.6 శాతం అంటే రూ. 6,01,071 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చినట్లు స్వయంగా చంద్రబాబు ప్రభుత్వమే ప్రకటించింది. చంద్రబాబు హయాంలో 2014-19 మధ్య ఏడాదికి వచ్చిన పెట్టుబడులు సగటున రూ.12 వేల కోట్లే. రెండేళ్లపాటు కోవిడ్ ఉన్నా సరే వైయస్సార్‌సీపీ హయాంలో వచ్చిన పెట్టుబడులు సంవత్సరానికి సగటున దాదాపుగా రూ.15,700 కోట్లు. పరిశ్రమల విషయంలో ఇదీ మా ప్రభుత్వ స్ట్రైక్ రేట్.

### నాడు తయారీ, పరిశ్రమల రంగాల్లో సౌత్‌లో ఏపీ టాప్ :

పెట్టుబడి సదస్సులనేవి ఫార్స్‌గా మారకూడదని వైయస్ జగన్ చెప్పేవారు. వీలైనన్ని వాస్తవ రూపంలోకి రావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తరపు నుంచి మానిటరింగ్, ఇంప్లిమెంటేషన్ ప్యానల్‌ను చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో ఏర్పాటు చేశాం. పరిశ్రమల శాఖ అధికారులు, సీఎంఓ అధికారులు ప్రతివారం సమావేశమై ఒప్పందాలు కుదుర్చుకున్న పారిశ్రామికవేత్తలతో మాట్లాడుతూ.. వాస్తవ రూపం దాల్చడానికి ఒక ఫాస్ట్ ట్రాక్ మార్గాన్ని ఏర్పాటు చేశాం. సింగిల్ విండో పద్ధతుల్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. భూకేటాయింపులు, క్లియరెన్సులు, టైమ్ లైన్ లోగా ఇప్పించే ప్రయత్నాలు చేశాం. పారిశ్రామిక వేత్తలకు ఒక ఫోన్ కాల్ దూరంలో ఉండేవాళ్లం. అందుకనే మా స్ట్రైక్ రేటు ఈ స్థాయిలో ఉంది. కోవిడ్ లాంటి పరిస్థితులు ఉన్నప్పటికీ.. దీనికి పూర్తి విరుద్ధంగా, 2019-24 కాలంలో దక్షిణ భారతదేశంలో తయారీ రంగ జీవీఏ వృద్ధిలోనూ, మొత్తం పరిశ్రమల రంగ జీవీఏ వృద్ధిలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. ఇది పూర్తిగా వైయస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాల ఫలితమే. ఈ వాస్తవ గణాంకాలు, 2019-24 కాలంలో 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ నాశనం అయింది' అంటూ టీడీపీ ఏళ్ళ తరబడి ప్రచారం చేసిన అబద్ధాలను పూర్తిగా బట్టబయలు చేస్తున్నాయి.

### 22(ఏ)లో భూములు చేర్పించింది చంద్రబాబే..

రెవెన్యూ సమస్యలను తామే పరిష్కరిస్తున్నట్టుగా కూటమి ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటోంది. అసలు 22ఏ జాబితాలో భూములను పెట్టిందే చంద్రబాబైతే ఆ భూముల విషయంలో ఒక వక్రీకరణతో కూడిన ప్రచారం చేస్తోంది. 2014-19 మధ్య వెబ్ ల్యాండ్ పేరు చెప్పి, ఎమ్మార్వో కార్యాలయాల్లో టీడీపీ కార్యకర్తలను, వారికి సంబంధించిన మనుషులను పెట్టి గిట్టనివారి భూములన్నింటినీ 22ఏలో పెట్టారు. ఆ రోజు నుంచి భూ యజమానులు నానా అవస్థలు పడుతున్నారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ఆ బాధితులకు ఊరట కలిగింది. 2024లో మళ్లీ చంద్రబాబు సీఎం అయ్యాక అసైన్డ్ భూములు, ఇతరత్రా కేటగిరీల భూములకు సంబంధించిన ఫ్రీ హోల్డ్ విషయంలో నానా ఆరోపణలు చేసి, ఇప్పటికీ భూ యజమానులను నానా కష్టాలకు గురి చేస్తున్నారు. అక్రమాలు జరిగాయని ఎన్ని ఆరోపణలు చేసినా ఎలాంటి ఆధారాలు లేవని మీ అధికారులే చెప్పారు.

### అమరావతిలో పేదల భూములు కాజేసింది మీరు కాదా ?

నిజంగా అసైన్డ్ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడింది కూడా టీడీపీ నాయకులే. 2014-19లో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పేదలకు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. రాజధాని అని పేరు చెప్పి అమరావతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను మభ్యపెట్టి, మోసం చేసి 1100 ఎకరాలు కొట్టేశారు. అసైన్డ్ దారుల చేతిలో భూములు ఉంటే పరిహారం రాదని, ప్లాట్లు రావని ఒక పథకం ప్రకారం ప్రచారం చేసి లాగేసుకుని ఆ తర్వాత జీవో ఇచ్చి, వాటిని పప్పు బెల్లాలకు కొనుగోలు చేసి, చేతులు మారిన తర్వాత అవే భూములను పూలింగ్ లోకి తీసుకుని ప్లాట్లు కేటాయించుకుని, వాటిని తిరిగి అమ్ముకుని కోట్లు కొల్లగొట్టారు. 1336 మంది బినామీలు ఇలా ఉన్నారు. ఆ కేసులను కూడా ఇప్పుడు చంద్రబాబు నాయుడు ఎత్తివేయించుకున్నాడు. తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడు.

### అసైన్డ్ భూముల సమస్యకు జగన్ పరిష్కారం :

అసైన్డ్ భూముల సమస్య ఈనాటిది కాదు. ఈ భూములు ఉన్న పేదలు, రైతులు అందరూ దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారు. భూమి ఉన్నా కష్టం వచ్చినప్పుడు అమ్ముకోలేని పరిస్థితి. రికార్డుల్లో ఒక పేరు.. భూమి దగ్గరకు వస్తే, సంవత్సరాల తరబడి మరొకరి పేరు. దేనికీ పొంతన లేదు. అందుకే పేదలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో వైయస్ జగన్ గారు సీఎం అయ్యాక అసైన్డ్ చట్టానికి సవరణలు చేసింది. గత ఏడాది అక్టోబరు 27న దీనికి సంబంధించిన గెజిట్ జారీ అయ్యింది. చట్టానికి సవరణలు చేసినప్పుడు కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడా అవినీతి లేదా ఒరిజనల్ అసైన్డ్ దారులకు ఎలాంటి నష్టం రాకుండా సీనియర్ అధికారులు, న్యాయ నిపుణులు, సీనియర్లు అంతా కలిసి కూర్చుని చక్కటి నిర్ణయాలు తీసుకుని చట్టానికి సవరణలు చేశారు. ఒరిజనల్ అసైనీలకు మాత్రమే న్యాయబద్ధంగా, తమ ఇష్టపూర్వకంగా అవసరానికి అమ్ముకునే హక్కును కల్పించారు. ఒకవేళ ఇప్పటికే చేతులు మారిన సందర్భాల్లో కూడా కొనుక్కున్న వారికి కాకుండా ఒరిజనల్ అసైన్డ్ దారులకు మాత్రమే పూర్తి హక్కులు వచ్చేలా ఈ చట్టం పూర్తిగా పేదలకు అండగా నిలిచింది. మరి ఇలాంటి సందర్భాల్లో కుంభకోణాలకు ఆస్కారం ఎక్కడ ఉంటుంది ? 9 లక్షల ఎకరాలకు మోక్షం ఈ చట్టం చేస్తున్న సమయంలో చాలా మంది చాలా రకాల ఒత్తిళ్లు తెచ్చారు. అసైన్డ్ దారుల నుంచి కొనుగోలు చేసి 20 సంవత్సరాలు పూర్తయిన వారికి లేదా పదేళ్లు పూర్తయిన వారికి సర్వహక్కులు కల్పించేలా సవరణల్లో చోటు కల్పించాలని డిమాండ్ చేసినా వైయస్ జగన్ గారు ససేమిరా అన్నారు. అలా చేస్తే మొత్తం ఉద్దేశం నీరుగారిపోయే ప్రమాదం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఒరిజనల్ అసైన్ దారులకు తప్ప వేరొకరికి అవకాశం ఇవ్వొద్దని తేల్చిచెప్పారు. ప్రతి విషయంలోనూ ప్రభుత్వం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది. ఈ రకంగా దాదాపు 9 లక్షల ఎకరాలను 22 ఏ నుంచి తొలగించారు. అలాంటిది కూటమి ప్రభుత్వం వచ్చాక రిజిస్ట్రేషన్లు నిలిపేయమని, ఫ్రీ హోల్డ్ చేయొద్దని ఆదేశాలు ఇచ్చి భూ యజమానులు ఇబ్బంది పెడుతున్నారు. నిజానికి అసైన్డ్ భూములు కానీ, చుక్కల భూములు కానీ, షరతు గల పట్టాల భూములు కానీ.. రైతులు నానా ఇబ్బందులు పడిన పరిస్థితుల్లో, వైయస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరవాతే వారికి మేలు జరిగింది. 27.40 లక్షల ఎకరాలకు సంబంధించి 15.2 లక్షల మంది రైతులకు మేలుచేసింది. 22ఏ నుంచి మినహాయించామంటూ రెవెన్యూ మంత్రి మేమే చేస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నాడు. మా హయాంలో సమగ్ర సర్వే జరిగితే రైతుల భూములు పోతాయని తప్పుడు ప్రచారం చేశారు. ల్యాండ్ టైట్లింగ్ ని భూతంగా చూపారు. ఇప్పుడు మళ్లీ సమగ్ర సర్వే అంటూ.. మా పద్ధతులే ఫాలో అవుతున్నారు.

### బెదిరించి లాక్కుంటున్నారు

ఇప్పుడు టీడీపీ ఎక్కడ అసైన్డ్ భూములుంటే అక్కడ వాలిపోతున్నారు. రూపాయి భూమిని ఇప్పుడు పది పైసలకు, పావలాకు అడిగి అధికార బలాన్ని ప్రయోగించి భూములు కొట్టేస్తున్నారు. ప్రభుత్వం మాది, మీకు హక్కులు ఇచ్చేది లేదని బెదిరిస్తున్నారు. జిల్లాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు పంచేసుకు ని వారి ముఠాలను రంగంలోకి దించి వసూళ్లకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేసిన కాకాణి గోవర్ధన్ రెడ్డి.. చట్ట సవరణల ద్వారా లబ్ధి పొందిన పేదలను కూడా బెదిరించి, లొంగదీసుకుని ఆ భూ వ్యవహా రాలను తిరిగి తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.

# ఇంటింటి సర్వే చేసి నివేదిక అందించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో వార్డు సచివాలయం వెల్ఫేర్, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులకు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే నిర్వహణపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ద్వారా ఒక కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం ఒకే వేదికపై సేకరించి, సేవలను మరింత సమర్థవంతంగా అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల గుర్తింపుకై అర్హులైన కుటుంబాలను సులభంగా గుర్తించి పథకాలు అందించడానికి ఉపయోగపడుతుందని వివరించారు. కుటుంబ వివరాల సమగ్ర సమాచారము, కుటుంబ సభ్యులు, నివాసం, వృత్తి, ఆదాయం వంటి వివరాలను సేకరించి డేటాను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. అర్హులైన, అవసరమైన వారికి మాత్రమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు చేరేలా సర్వే ద్వారా ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకొని ఉన్నామని తెలిపారుప్లానింగ్ అండ్ పాలసీ రూపకల్పన ద్వారా నూతన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు ఖచ్చితమైన వివరాలను సర్వే ద్వారా సేకరించగలమని కమిషనర్ వివరించారు. డూప్లికేషన్ నివారించి ఒకే వ్యక్తికి/కుటుంబానికి పునరావృతంగా లబ్ధి చేకూరకుండా అడ్డుకుంటుందని, ఆరోగ్యం, విద్య, సంక్షేమ సేవలలో మరింత మెరుగుదల కనబరిచి ప్రజల అవసరాల ఆధారంగా సేవలను బలోపేతం చేయడానికి సహకరిస్తుందని చెప్పారు. సర్వేలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రతి ఇంటి నుంచి ఆయా సభ్యుల పూర్తి సామాజిక, ఆర్థిక పరిస్థితి, కులము, ఇతర వివరాలను సర్వే చేసి పరిపూర్ణ నివేదికను అందజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అంద జేయడానికి సర్వే నిర్దేశించబడిందని కమిషనర్ వివరించారు. సర్వే నిమిత్తం ఇంటింటికి తిరిగే వార్డు సచివాలయ కార్యదర్శులకు ప్రజలంతా సహక రించి ఈ కేవైసీ అప్డేట్ చేయించుకునే కార్యక్రమంలో భాగస్వాములు కావా లని కమిషనర్ సూచించారు. ఈ అవగాహన సదస్సులో నెల్లూరు నగర పాలక సంస్థ సచివాలయ అడిషనల్ కమిషనర్ హిమబిందు వార్డు సచివా లయ వెల్ఫేర్, ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రైతుకు మేలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తిరుమలా పురం పంచాయతీ గుడినరవ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుడమితల్లిని నమ్ముకున్న రైతన్నలకు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పం. పిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం ప్రచారపిచ్చితో పాసుపుస్తకంపై జగన్ ఫోటో వేసేందుకు రూ.900 కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేసిందన్నారు. ఆ పుస్తకంతో రైతులు బ్యాంకులకు వెళ్లినా రుణాలు దక్కలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన పంట దిగుబడులను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయడంతోపాటు సకాలంలో పెట్టుబడి సాయం అందజేసి బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, సర్పంచ్ కృష్ణ టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసిం హులు, నల్లిపోగు రాజా, పెదవెంకటయ్య, రాజా, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు మస్తాన్, నాగూర్ బీ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ దివాకర్ జన్మదిన వేడుకల్లో కావలి ఎమ్మెల్యే




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి పిఏ బిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఏడు రాష్ట్రాల సంఘాల నాయకులు డాక్టర్ దివాకర్ జన్మదిన వేడుకలు శనివారం చర్చిలో అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా వారికి డాక్టర్ దివాకర్‌తో పాటు సంఘం నాయకులు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేని సెలవుతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే దివాకర్ని అభినందిస్తూ కేక్ కట్ చేసి శుభకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివాకర్‌అంటే నాకు ఎంతో ఇష్టమని నా రాజకీయ జీవితంలో నా గెలుపు కోసం ఆయన ఎంతో కృషి చేశారని, ఆయన చేసిన మీరు నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను సొంత ఊరు కోసం ఏదో ఒకటి చేయాలని తపన కలిగిన వ్యక్తి దివాకర్ అని అలాంటి వ్యక్తి జీవితంలో ఇలాంటి సంతోషకరమైన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ.. తన జన్మదిన వేడుకలు హాజరైన ఎమ్మెల్యే కావ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో ఎప్పుడు ముందుండి కావలి నియోజకవర్గంని మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, పాస్టర్లు, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

## వేమిరెడ్డి దంపతులను కలిసిన అలేఖ్య దంపతులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి అగ్రికల్చర్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు పోతి గంటి అలేఖ్య శనివారం నెల్లూరులో తెలుగుదేశం పార్టీ నెల్లూరు జిల్లా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని వారి స్వగృహంలో వారి దంపతులకు, పోతుగంటి అలేఖ్య దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాల్వా తో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. నూతన సంవత్సరంలో నెల్లూరులో లేకపోయి నందు వల్ల ఈరోజు కలవడం జరిగింది. అనంతరం కావలి రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు చర్చించుకున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తోట వెంకటేశ్వర్లు కూడా ఉన్నారు.

## మంత్రి ఆనంకు స్వాగతం పలికిన టీడీపీ నేతలు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం హసనాపురం గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి మండల టిడిపి నేతలు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇంఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో మండల టిడిపి నేతలు గ్రామస్తులు మంత్రి ఆనంకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డికి శాలువా కప్పి బొకే అందజేసి స్వాగతం పలికారు.

## వెనుక బడిన విద్యార్థుల పై ప్రత్యేక దృష్టిఉంచాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 75 రోజుల ఎఫ్ఎల్ఎన్ ప్రణాళిక కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పక్కాగా నిర్వహించాలని ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు సూచించారు. శనివారం మం డలంలోని గుడినరవ, మాసాయిపేట మెయిన్, ఉర్దూ పాఠశాలలను సందర్శించారు. తరగతికి తగ్గట్టుగా విద్యార్థు ల సామర్థ్యాలు ఉండేలా చూడాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని రెమిడియల్ తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## అసంపూర్తి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో అసంపూర్తిగా ఉన్న, నాణ్యత లోపించిన పక్కాగృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బీ.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజనీరింగ్ అసి స్టెంట్లు, కాంట్రాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. థర్ట్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ బృందం మండలంలో 141 గృహ నిర్మాణాలను పరిశీలన చేసి 40 గృహాల నిర్మాణం సరిగాలేదని గుర్తించిందన్నారు. అవన్నీ వారం రోజుల్లో పూర్తి చేసి పని ప్రారంభించాలని కాంట్రాక్టర్కు సూచించారు. ఉగాదికి 5 లోల గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఆదిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ పీరాన్, ఏఈ షరీఫ్, వర్కుఇనస్పెక్టర్ హర్షవర్ధన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన వరికుంటపాడులో వెలిసి ఉన్నటువంటి శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాత లుగా ప్రకాశం జిల్లా పామూరు మండలం గోపాలపురం గ్రామానికి చెందిన గాజులపల్లి శ్రీనివాసరెడ్డి విజయలక్ష్మి దంపతులు వారి కుమా రులు గాజులు పల్లి సాయినాథ్ కుమార్తె స్వాతిరెడ్డి శాశ్వత నిత్య అన్న దానం కొరకు 101116 రూపాయలు దాతగా అందజేశారు. వారికి ఆల య ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ స్వామివారి చిత్రపటం దుశ్శా లవాతో సన్మానించారు. వారికి ఆలయ అర్చకులు గోత్రనామాలతో ప్రత్యే క పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా పామూరు గ్రామానికి చెందిన సోమిశెట్టి శ్రీనివాసులు శ్రీలత దంపతులు ప్రసాదం కొరకు 30 కేజీల బెల్లాన్ని అందజేశారు. రామా పురంకి చెందిన రావెళ్ల నాగేంద్ర కుమార్, అరుణ కుమారి దంపతులు పుట్టినరోజు సందర్భంగా 25 కేజీలు, దొండల వెంకటేశ్వర్లు అశ్వనీ దంపతులు 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఆలయానికి వచ్చినటువంటి భక్తులు అందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. దాతల అందరికీ ఆలయ ధర్మకర్త సూర్యనారాయణ అమ్మాజీ దంపతులు స్వామివారి చిత్రపటాలతో సన్మానించారు.

# పొగ మంచుతో జర భద్రం

## వాహనదారులకు ఇబ్బందులు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల్లో కారణంగా ఏర్పడుతున్న దట్టమైన పొగమంచుతో వాహనదారులు జరభద్రంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది ఈ దట్టమైన పొగ మంచు ఏర్పడడం వలన కనీసం దారి కూడా కనిపించే అవకాశం లేకుండా ఉంది. ఈ పొగ మంచుతోనే వాహనాలు సుమారు 9 గంటల వరకు కూడా లైట్ తో రావాల్సి ఉంది. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కూడా గుర్తించలేనంతగా ఈ పొగ మంచు ఏర్పడుతుంది. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి వాహనదారులు ఎంతో జాగ్రత్తగా ప్రయాణం సాగించి తమ ప్రాణాలను కాపాడుకోవాల్సి ఉంటుంది. దట్ట మైన పొగ మంచు ఏర్పడడంతో కూలీ పనులకు వెళ్లే కూలీలు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కానీ పనులకు వెళ్లే ప్రజలు కానీ వాహనాల నడిపే వాహన చోదకులు కానీ ఎంతో అసౌకర్యంగా వెళ్ళవలసి వస్తోంది సుమారు 9 గంటల సమయం అయ్యేంత వరకు కూడా సూర్యుని దర్శనం కాకపోవడంతో వాతావరణం చలిగా మారుతుంది ప్రకృతిలో వచ్చే మార్పులకు అనుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల పరిస్థితులకు ప్రజలు ఆలోచించి తమ యొక్క ప్రయాణాలను పనులను చేసుకోవలసి ఉంటుంది.

# అంధత్వం ఉందని అధైర్యపడలేదు

- ఒడిదుడుకులను అధిగమించి
- కార్యదీక్షతో విద్యారంగంలో ముందుకు
- పలువురికి ఆదర్శమవుతున్న ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ






**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులు ఉండి సకల సౌఖ్యాలు అందిస్తూ ఉంటేనే విద్యార్థులు విద్యను అభ్యసించడం గగనమైంది. అలాంటి తరుణంలో అవయవాలు కూడా అన్ని ఉంటే గాని ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి పుట్టుకతోనే అంధుడని అధైర్య పడకుండా ముందుకు సాగాడు. అసాధారణమైన సంకల్పబలం, అచంచలమైన కార్యదీక్షతో విద్యా రంగంలో తనదైన ముద్ర వేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అతనే జిల్లాలోని మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పోలూరి లక్ష్మీనారాయణ. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని మర్రిపాడు మండలం నందవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న పోలూరి లక్ష్మీనారాయణ పలువురికి ఆదర్శమే నిలుస్తున్నారు. పుట్టుకతోనే అంధుడని అధైర్య పడకుండా కార్యదీక్షతో విద్యను అభ్యసించి చివరికి ప్రిన్సిపల్‌గా అందరి మన్ననలు పొందుతున్నాడు. ఆయన స్వగ్రామం ఉమ్మడి జిల్లాలోని వెంకటగిరి. ఆ గ్రామానికి చెందిన జయప్రకాష్ సుజాత దంపతులకు లక్ష్మీనారాయణ జన్మించాడు. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆయన జీవితంలో ఎదురైన ప్రతీ అడ్డంకిని ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. తిరుపతిలోని అంధుల పాఠశాలలో తన విద్యా ప్రయాణాన్ని ప్రారంభించి డిగ్రీ, అనంతరం బీఈడీ, పీజీలను పూర్తి చేశాడు. 2013వ సంవత్సరంలో సూళ్లూరుపేట దగ్గర ఏపీఎంఎస్ మామిళ్లపాడు పాఠశాలలో పిజిటి ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనంతరం పదోన్నతి నిమిత్తం నందవరం ఆదర్శ పాఠశాలకు ప్రిన్సిపల్‌గా రావడం జరిగింది. విద్యారంగంలో అడుగు పెట్టినప్పటి నుంచి తన వైకల్యాన్ని ఎప్పుడూ అడ్డంకిగా భావించకుండా, ఉపాధ్యాయులతో కలిసిమెలిసి పనిచేస్తూ వస్తున్నారు. అలాగే పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. ఆధునిక బోధనా విధానాలు, క్రమశిక్షణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో నందవరం మోడల్ స్కూల్‌ను ఒక ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు ప్రేరణగా, ఉపాధ్యాయులకు మార్గదర్శిగా నిలుస్తున్న లక్ష్మీనారాయణ నేడు సమాజమంతా గర్వపడే వ్యక్తిగా నిలిచారు. అంధత్వం ఒక అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం ఉంటే ఏ శిఖరాన్నైనా అధిరోహించవచ్చని నిరూపిస్తున్న వారి జీవన ప్రయాణం అనేక మందికి స్ఫూర్తిదాయకంగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది వారిని అభినందిస్తూ నూతన సంవత్సర సందర్భంగా ఘనంగా సత్కరించి, వారి జీవితాన్ని ప్రతిబింభించే విధంగా రూపొందించిన సన్మాన పత్రాన్ని బహుకరించారు.

# పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ 6వ వార్షికోత్సవ వేడుకలు

- నేడు మెగా రక్తదాన శిబిరం
- సంస్థ వ్యవస్థాపకులు కొగిలి రమేష్ రాజు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ 6వ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి అన్న నినాదంతో ముందుకు సాగుతున్న సంస్థ మా పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ అని సంస్థ వ్యవస్థాపకులు కొగిలి రమేష్ రాజు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ 6వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా నెల్లూరులోని పెన్నానది అనుకుని ఉన్న దీన్ దయాల్ కాలనీ వద్ద 200 మందికి పైగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని మా సంస్థ సభ్యులతో కలిసి నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ ప్రెసిడెంట్ మునివెంకట సూర్య మాట్లాడుతూ.. తమ సంస్థ 6వ వార్షికోత్సవంలో భాగంగా గత 3 రోజుల నుండి నెల్లూరులో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా ఆదివారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని దర్గామిట్ట, ప్రగతి నగర్ మెయిన్ రోడ్ వద్ద మెగా రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా రక్తదానం చేసి ప్రాణ దాతగా నిలవాలని ఆకాంక్షించారు. తామ సొసైటీ పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ శ్రీకాంత్, ధనలక్ష్మి, సతీష్, యశ్వంత్, అఖిల, సురేష్, లక్ష్మణ్, జోహన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో శివముక్కోటి వేడుకలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరాలయం (శివాలయం)లో శనివారం శివముక్కోటి వేడుకలను ఆలయ ప్రధానఅర్చకులు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివ కుమార్‌శర్మ (శివయ్యస్వామి) ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసంలో వచ్చే ఆరుద్రనక్షత్రమే శివమోక్కటి వేడుకలుగా నిర్వహిస్తుంటారు. అత్యంత పవిత్రమైన ఈకార్యక్రమాన్ని శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్వామివారికి అన్నాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రుద్ర హొమం, మృత్యుంజయహొమం కార్యక్రమాలను కూడా నిర్వహించారు. భక్తులు విరివిగా హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈకార్యక్రమంలో అర్చకులు మేళ్లచెరువు సంతోష్‌కుమార్‌స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి 195వ జయంతి వేడుకలు



**కావలి, మేజర్‌న్యూస్ :** సావిత్రి బాయి 195వ జయంతి వేడుకలను శనివారం కావలి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో కావలి మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లీగల్ మెంబర్ ఐ.సాయిప్రసాద్, లోక్ అదాలత్ మెంబర్ ఎం.మాలకొండరెడ్డి మాట్లాడుతూ.. తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. మహిళా ఉపాధ్యాయులు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని బడిబైట్ బాలికలను పాఠశాలలో చేర్పించి ఉన్నత విద్యను అభ్యసించే దానికి ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి ఉపాధ్యాయులు సిబ్బంది బాలికలు పాల్గొన్నారు.

## అధ్యాపకునికి ఆర్థిక సహాయం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని శ్రీ వివేకానంద కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్న చిన్ని కృష్ణయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులో చికిత్స పొందుతున్నారు. శనివారం శ్రీ వివేకానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ మద్దూరు గోపాల్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డ్రామా బత్తిన సుబ్రహ్మణ్యం స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.కొండయ్యగౌడ్లు నెల్లూరు వెళ్లి చికిత్స పొందుతున్న చిన్ని చిన్ని కృష్ణయ్యను పరామర్శించి లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ గంగపట్ల వెంగయ్య ఉపాధ్యాయులు రాములు తదితరులున్నారు.

## చుంచులూరులో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాల నందు శనివారం ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు సునీత, రహిమలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ మాట్లాడుతూ.. మనదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అనీ, మహిళా విద్య కోసం ఎంతగానో కృషి చేశారని, వారి జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ కలిశెట్టి రాజేంద్ర కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ టీడీపీ కార్యకర్తగా ఒంటేరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం నాయకుడు ఒంటేరు మల్లికార్జునకు ఉత్తమ టిడిపి కార్యకర్తగా అవార్డు లభించింది. రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదరవిచంద్ర, తెలుగుదేశం నాయకుడు తాళ్ళూరు గిరినాయుడుల చేతులమీదుగా మల్లికార్జున ఈ అవార్డును అందుకున్నారు. 14వవార్డు టిడిపి ఇన్‌చార్జ్‌గా ఉన్న మల్లికార్జున పార్టీ కార్యకలాపాల్లో అత్యంత చురుగ్గా అంకితభావంతో పాల్గొంటుంటారు. ఆయనసేవలను గుర్తించి ఉత్తమ టిడిపి కార్యకర్తగా అవార్డును బహూకరించారు. ఈసందర్భంగా తనకు అవార్డు బహూకరించిన మంత్రి ఆనం, ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్సీ బీద, నాయుడు తాళ్ళూరులకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. తనవంతుగా పార్టీ బలోపేతానికి, పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని, పార్టీకార్యక్రమాలన్నింటిలో భాగస్వామ్యుడనవుతానని మల్లికార్జున పేర్కొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరులోని బీజేపీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నమామి గంగే కన్వీనర్ మిడతల రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు విద్య నేర్పించాలని ఉద్దేశంతోనే మహిళలకు ఉన్నత విలువల్ని ఆ రోజుల్లోనే ఆ మహాతల్లి సావిత్రిబాయి పూలే తీసుకున్న నిర్ణయమే మహిళలు ఉన్నత స్థానంలో ఉండాలని మగవాళ్ళకి ధీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆమె చూపించిన త్యాగం సాహసం ఈరోజు మహిళలు సైంటిస్టులుగా ప్రతి రంగంలోనూ రాణిస్తున్నారు. ఎన్నో కార్యక్రమాల్లోనూ ముందు ఉంటున్నా ఆనాడు ఆమె తీసుకున్న నిర్ణయమే పొదలకూరులో ఇంత ఘనంగా సావిత్రి బాయి పూలే 195వ జయంతి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జిల్లా అధ్యక్షులు బాలాజీ, చేనేత జిల్లా నాయకులు సోమ గోపాల్, బీజేపీ పొదలకూరు మండల అధ్యక్షుడు పూల ప్రశాంత్, బీజేపీ సీనియర్ నాయకులు చింత గింజల సుబ్రహ్మణ్యం, దాసరి సురేంద్ర, బీజేపీ మండల ఉపాధ్యక్షులు రాజపూటి ధనంజయ, చొప్ప వెంకటేశ్వర్లు, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు గురుస్వామి, మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు ఎం.కిష్టయ్య, సోషల్ మీడియా కో కన్వీనర్ రావుల అంకయ్య, బీజేపీ మహిళా నాయకురాలు యనమాల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

- మహిళా విద్య, సామాజిక సమానత్వమే లక్ష్యం
- జనసేన సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహా సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని పప్పుల వీధిలోని సత్రం స్కూల్ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా మహిళా విద్య, సామాజిక సమానత్వం, సమాన అవకాశాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా నిలిచిన సావిత్రిబాయి పూలే 1848లో పుణేలో తొలి బాలికల పాఠశాల స్థాపించి, భర్త జ్యోతిరావు పూలేతో కలిసి కుల, లింగ వివక్షలకు వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తు చేశారు. 1897లో ప్లేగ్ బాధితులకు సేవ చేస్తూ ప్రాణత్యాగం చేసిన ఆమె జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే జనసేన పార్టీ సిద్ధాంతానికి సావిత్రిబాయి పూలే గారి జీవితం ప్రతిరూపం అని ఈ సందరరేగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీసీ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే – మహిళా విద్యకు చిరకాల ప్రేరణగా నిలిచిన మహానీయురాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరాల సుబ్రహ్మణ్యం, సమాది శ్రీనివాస్ యాదవ్, ముత్యం గౌడ్, ఎస్.శ్రీనివాస్ యాదవ్, రాళ్లపల్లి వెంకట జ్యోతి, కందుకూరు శ్రీకుమార్, పవన్ కుమార్ యాదవ్, పేనేటి శ్రీకాంత్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# చలికాలంలో తెల్లవారుజామున పొంచి ఉన్న ముప్పు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** చలికాలం ప్రారంభమవడంతో గ్రామీణ, అర్ధపట్టణ ప్రాంతాల్లో గుండె (కార్డియాక్), మెదడు (న్యూరోలాజికల్) సంబంధిత అత్యవసర కేసులు పెరుగుతున్నాయని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ ఎస్.రవీంద్రారెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా తెల్లవారుజామున సమయాల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆయన హెచ్చరించారు. వైద్యుల విశ్లేషణ ప్రకారం, చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల మన శరీరంలోని రక్తనాళాలు కుంచించుకుపోతాయి (వేసోకన్స్ట్రిక్షన్). దీని వల్ల, రక్తపోటు (బీపీ) అకస్మాత్తుగా పెరుగుతుంది. గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది, రక్తం చిక్కబడి గడ్డకట్టే (క్లాటింగ్) అవకాశం పెరుగుతుంది. క్లినికల్ గణాంకాల ప్రకారం, వేసవితో పోలిస్తే చలికాలంలో హార్ట్ అటాక్, స్ట్రోక్ కేసులు 25 నుండి 30 శాతం వరకు పెరుగుతున్నట్లు గుర్తించారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న రిస్కసుమారు 60 శాతం మంది రోగులు ప్రారంభ లక్షణాలైన ఛాతిలో అసౌకర్యం, అశాంతి లేదా చిన్నపాటి నొప్పిని చలి ప్రభావం లేదా గ్యాస్ట్రిక్ సమస్యగా భావించి సమయాన్ని వృధా చేయడం వల్ల సమస్య తీవ్రం అవుతుందని అన్నారు. సూర్యోదయానికి ముందే పొలం పనులకు లేదా దినచర్యల కోసం బయట ఉండటం వల్ల చలి తీవ్రత గుండె, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 35 శాతం మంది రోగులు చికిత్సకు అత్యంత కీలకమైన 'గోల్డెన్ అవర్' (సమస్య మొదలైన మొదటి గంట) దాటిన తర్వాతే ఆసుపత్రికి చేరుకుంటున్నారని, దీనివల్ల ప్రాణాపాయం పెరగడమే కాకుండా, చికిత్స ఫలితాలు కూడా ఆశించిన స్థాయిలో ఉండవు అన్నారు. ఛాతిలో నొప్పి, బిగుతు లేదా ఒత్తిడిగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా ఆయాసం,చేతులు లేదా కాళ్లు అకస్మాత్తుగా బలహీనపడటం,మాట తడబడటం లేదా మూతి వంకర పోవడం, తల తిరగడం లేదా అకస్మాత్తుగా అస్థిరత కలగడం అనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి వెళ్లాలి అనిడాక్టర్ ఎస్.రవీంద్ర రెడ్డి తెలిపారు.

# గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు ఆహ్వానం చేసుకోండి : ప్రిన్సిపల్ సమీరారెడ్డి

**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** సీతారామపురం గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్లో పీజీటీ జువాలజీ సబ్జెక్టు బోధించుటకు ఆసక్తిగల ఫ్యాకల్టీ ఈనెల 6వ తేదీ సాయంకాలం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సమీరారెడ్డి తెలిపారు. ఆసక్తిగల అతిధి ఉపాధ్యాయులు ఈనెల 6వ తారీకు సాయంకాలంలోపు తమ ఒరిజినల్ బీఈడీ సర్టిఫికేట్, జువాలజీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ సర్టిఫికెట్లతో పాఠశాల కార్యాలయ సిబ్బందిని కలవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకుని వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఈనెల 7వ తేదీన నెల్లూరు దర్గా మెట్టలోని జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో ఉదయం 9 గంటలకు డెమో క్లాసులు ఇచ్చేందుకు హాజరు కావలెనని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు నిర్వహించిన డెమోలో అర్హత పొందిన అభ్యర్థులకు నెలకు 12 వేల రూపాయల జీతంతో గెస్ట్ ప్రాతిపదికన పనిచేయవలసి ఉంటుందని తెలిపారు.



# అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో వెలసి ఉన్న ప్రసిద్ధ అంకాలమ్మ తల్లి ఆలయంలో వరికుంటపాడు మండల టీడీపీ అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు, టీడీపీ నాయకులు అడుసుమల్లి వెంకటనారాయణ శనివారం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ నిర్వహకులు వారిని సన్మానించి గోత్రనామాలతో పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ నాదెళ్ల రాజా, మండల తెలుగు యువత అధ్యక్షులు ముజే లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ మధు, సొసైటీ చైర్మన్ గుర్రం గోపి, క్లస్టర్ ఇంచార్జి పోక మహేష్, నాయకులు పోద మాధవ, మాదినేని వెంగళరావు, ఆరె కొండ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబా పూలే జయంతి వేడుకలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని చాకలి కొండ గ్రామంలో ఉన్న రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు సావిత్రి పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయ బృందంచే ఘనంగా నిర్వహించ బడిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఏ సుభాషిని మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాల కోసం ఆమె చేసిన కృషిని పాఠశాల వివరించారు. అందుకే ఆమె జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు ఆమె తెలియజేశారు. సావిత్రిబాయి పూలే మొట్టమొదటగా తను విద్య నేర్చుకుని అలాగే బాలిక విద్యను అందజేసేందుకై స్వతహాగా పాఠశాలలు స్థాపించి బాలికలకు విద్యను నేర్పించారు. మహిళలకు చదువు ఎంత అవసరమో తెలియజేశారు. కుటుంబంలో మహిళ చదివినట్లయితే ఆ కుటుంబం అంతా విద్యా వంతులుగా ఉంటారన్నారు. పై కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల మహిళా ఉపాధ్యాయులు ఏ.సుభాషిని ని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ నరేష్ మస్తానయ్య, వెంకటేష్ జూనియర్ అసిస్టెంట్ రామిరెడ్డి పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నేలపాటి రఘురామయ్య ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ.. భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంఘసంస్కర్త అనీ తన భర్తతో కలిసి చదువు నేర్చుకుని కడవరకు తన జీవితంలో ఎన్నో అవమానాలను భరించి అనేక పాఠశాలలు స్థాపించి వారి చదువు కోసం మహిళల హక్కుల కోసం, దళితులకు సామాజిక న్యాయం కోసం కృషి చేశారని భవిష్యత్ తరాలు తెలుసుకునేందుకు కోసం ప్రతి పాఠశాలలో సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని పెట్టాలని కోరారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను ముందుకు తీసుకొని పోవడమే నేడు మన ముందున్న కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాము, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** రైతును రాజుగా చూడాలనే దృఢ సంకల్పంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏఎస్‌పేట మండలం హసనాపురం గ్రామంలో రైతుల ఆనందోత్సాహాల నడుమ ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను అధికారులతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రైతుల ఇంటి వద్దకే వెళ్లి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు సంపూర్ణ భూ యాజమాన్య హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ వంటి ఆధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు, గత ప్రభుత్వం గత ముఖ్య మంత్రి ఫోటోలతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేసి, ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాలను పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు అధికారం చేపట్టిన తొలి క్యాబినెట్ సమావేశంలోనే రైతులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం కోటి మంది రైతుల భూములకు వారి హక్కులు లేకుండా చేసే విధంగా పనికిరాని పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించేందుకు ప్రయత్నించిందని, ఎన్నికలకు మూడు నెలల ముందే ఈ దుర్మార్గపు ఆలోచనతో 35 లక్షల రైతుల పాస్ పుస్తకాలను మార్చేశారని విమర్శించారు. దొంగనోటు లాంటి పాత పాస్ పుస్తకాల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రం మొత్తం మీద 7200 గ్రామాల్లో గత ప్రభుత్వం 23 లక్షల పట్టాలు పంపిణీ చేసిందని, మరో 12 లక్షల పట్టాలను సిద్ధం చేసిందని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు గత ప్రభుత్వం జగన్ ఫోటోతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేసిందని, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 13 గ్రామాల్లో 5,486 పట్టాలను అందించారని తెలిపారు. వాటి స్థానంలో నేడు ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నూతన



పాస్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రతి నెల 1 నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, ప్రతి నెల 9వ తేదీన ఏదో ఒక గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా హాజరై పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారని మంత్రి తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఎలాంటి చిన్న తప్పు ఉన్నా వెంటనే సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. 'రైతుకు అన్నం పెట్టే భూమికి రైతును రాజుగా చేయడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం' అని స్పష్టం చేశారు. రీ-సర్వే పేరుతో గత ప్రభుత్వం భూముల సర్వేలో కూడా హద్దు రాళ్లపై జగన్ ఫోటోలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిచేస్తూ సుపరిపాలన కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు 2026 డిసెంబర్ చివరి నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతులకు అండగా నిలుస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, నియోజకవర్గ టీడీపీ నాయకులు కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు రవీంద్రారెడ్డి రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు కుడుముల సుధాకర్ రెడ్డి కేశవ చౌదరి టిడిపి మండల నాయకులు పులిమి సుధాకర్ రెడ్డి కే.నరసింహారెడ్డి ఏలూరు మాలాద్రి నాయుడు దేవరాల హజరత్ అయ్యా అల్లంపాటి మాధవరెడ్డి పైడి శ్రీనివాసులు సురేష్ నాయుడు నంది వివేకానంద రెడ్డి సుబ్బారెడ్డి షేక్ జిలాని బాషా, తహసిల్దార్ అనిల్ కుమార్ అధికారులు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో సుభిక్షంగా ఉన్న రైతులు

*(మొదటి పేజీ తరువాయి)*

పాస్ పుస్తకాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. తాను ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. గత ప్రభుత్వం అన్నదాతల పాలిట శాపంగా తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతుల భూములకు సిఎం చంద్రబాబు రైతుల భూములకు భద్రత కల్పించారన్నారు. అత్యాధునిక సాంకేతికతో రూపొందించిన పట్టాదార్ పాస్‌బుక్‌పై గల క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి భూమి వివారాలు తెలుసుకోవచ్చని, సర్వే నెంబర్లు, పేర్లలో ఏవైనా పొరపాట్లుదొర్లి ఉంటే సరిదిద్దుకోవచ్చు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక దశాబ్దాల తరబడి పూడికలు తీయని కాలువలను కొన్ని ప్రభుత్వ పరంగాను మరికొన్ని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా బాగు చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించామన్నారు. గతమెన్నడు లేనివిధంగా గిట్టుబాటు ధర కల్పించి, ధాన్య సేకరణ చేసిన 24 గంటలలో రైతుల ఖాతాలలో హమాలీ కూలీలతో సహా వేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. మూడు విడతలుగా 7 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసి సన్నకారు రైతులను ఆదుకున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20నెలల కాలంలో అమలు చేసిన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మత్స్యకార భరోసా, స్త్రీశక్తి తదితర సంక్షేమ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించారు. గత ఐదేళ్లలో తట్టెడు మట్టికి నోచుకోని గ్రామీణ ప్రాంత రోడ్ల దుస్థితికి నేటికీ ఎంతో మార్పు ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక కాగులపాడు గ్రామంలో 50 లక్షల 70 వేల రూపాయలతో తాగునీరు, రోడ్లు, హాస్పిటల్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. 2 కోట్ల రూపాయలతో కాగులపాడు జొన్నవాడ లింక్ రోడ్డు, కోవూరు కాలువ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి పాళెం తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రంతులయ్య బుచ్చి అగ్రికల్చరల్ బ్యాంక్ ఛైర్మెన్ ఏటూరి శివరామకృష్ణారెడ్డి, వవ్వేరు బ్యాంక్ డైరెక్టర్ మద్దసాని మాల్యాద్రి, టిడిపి సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, బత్తల హరికృష్ణ, కోడూరు కమలాకర్ రెడ్డి, చేనేత సంఘ నాయకులు కెవి శేషయ్య, స్థానిక నాయకులు ఎడెం ప్రసన్న కుమార్ రెడ్డి, రవి నాయుడు, ప్రతాప్, టిడిపి యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## సావిత్రి బాయి పూలే అందరికి ఆదర్శం

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందరర్భేగా శనివారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ వైఓ నందన్, డిప్యూటీ మేయర్ తహసిన్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. మహిళా విద్యకు అంకురార్పణ చేసి, మహిళల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషిచేసిన సావిత్రిబాయి అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. విద్య ప్రాధాన్యతను సుమారు వందేళ్ళ క్రితమే గుర్తించి కట్టుబాట్ల మధ్య ఉన్న మహిళలకు విద్యతోనే పూర్తి స్వేచ్ఛ స్వాతంత్రం లభిస్తాయని దృఢంగా విశ్వసించిన సావిత్రి బాయి, మహిళల హక్కుల కోసం విశేషంగా కృషి చేసారని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించేందుకు కృషి చేయాలని మేయర్ సూచించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి ఖ్యాతి



సంపాదించి మహిళా విద్యకు బీజం వేశారని తెలిపారు. ఈనాడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నందుకు సావిత్రిబాయి పూలే ఆనాడు చేసిన సంస్కరణలే కారణమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తహసిన్, కార్పొరేటర్లు రవిచంద్ర, రామకృష్ణ, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రూ-అప్ చార్జీలను
# పూర్తిగా రద్దు చేశాం

*(మొదటి పేజీ తరువాయి)*

నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరలకు అందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి ఆనం స్పష్టం చేశారు.

**పెట్టుబడుల విషయంలో దేశంలోనే ఏపీ అగ్రగామి :**

దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే పారిశ్రామిక రంగంలో పెట్టుబడుల విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయం తాము ప్రకటించుకున్నది కాదనీ, దేశంలోనే పేరెన్నిక గల బ్యాంక్ ఆఫ్ బరోడా తమ సర్వేలో వెల్లడించినట్లు చెప్పారు. తమ ప్రభుత్వ 9 నెలల కాలంలోనే 25.3శాతం పెట్టుబడుల శాతం పెరిగినట్లు ఆ నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో సుపరిపాలనతో రామరాజ్య స్థాపనకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి ఆనం పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు తాళ్లూరు గిరినాయుడు, రవీంద్రారెడ్డి, రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇంటర్ఫ్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టీడీపీ కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, మండలంలోని టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్టణంకు తరలిన సీఐటీయు, సీపీఎం నాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విశాఖపట్టణంలో జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభలకు ఆత్మకూరు నుండి పలువురు తరలివెళ్ళారు. గత 3రోజులుగా విశాఖపట్టణంలో ఈ మహాసభలు జరుగుతుండగా 7వ తేదీవరకు కొనసాగనున్నాయి. రెండు రోజులపాటు ఈ మహాసభల్లో పాల్గొనేందుకు ఆత్మకూరు నేతలు శనివారం తరలివెళ్ళారు. ఆత్మకూరు పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్ రాజు, సిఐటియు జిల్లా నాయకుడు జి.వి.శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో పలువురు నాయకులు విశాఖపట్టణంకు తరలివెళ్ళారు. కార్మిక, కర్షక సమస్యలను సభలో చర్చిస్తామని వారు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా అంతర్జాతీయ మహిసభలు జరుగుతున్నాయని, అత్యంత ముఖ్యమైన అంశాలను గురించి చర్చించి తీర్మానాలు చేస్తారని వారు పేర్కొన్నారు.

## అపస్మా టాలెంట్ టెస్ట్ ఈనెల 8న

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** అపస్మా ఆధ్వర్యంలో మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ ఈనెల 8వ తేదీన పాఠశాల స్థాయి పరీక్ష నిర్వహించబడుతుందని అపస్మా నియోజకవర్గ అధ్యక్షులు కేవీ రత్నం, పోలు అంకిరెడ్డి ఇతర సభ్యులు తెలియజేశారు. ఈ పరీక్ష గణితం 43 భౌతిక శాస్త్రం 20 మార్కులు జీవశాస్త్రం 20 మార్కులు సాంఘిక శాస్త్రం 40 మార్కులు మొత్తం 120 మార్కులకు పరీక్ష నిర్వహింపబడుతుందని తెలిపారు. ఒక్కో ప్రశ్నకు ఒక్క మార్కు ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ పరీక్ష కేవలం పదవ తరగతి విద్యార్థులకు మాత్రమే ఉంటుందన్నారు. పాఠశాల లెవెల్‌లో విజేతలైన వారు ఈనెల 25వ తేదీననియోజకవర్గ స్థాయిలో జరిగే టాలెంట్ టెస్ట్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో విజేతలైన వారు ఫిబ్రవరి 4వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే పరీక్షకు హాజరు కావలసి ఉంటుందని తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రం మెమొంటో అందజేయబడతాయని తెలిపారు. కావున ఆయా పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని వారుతెలిపారు.

## సీడ్ క్యాపిటల్ ఉద్దేశ్యం, అమలుపై లబ్ధిదారులకు శిక్షణ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల సమాఖ్య కార్యాలయం నందు సీడ్ క్యాపిటల్ ఉద్దేశ్యం, అమలుపై లబ్ధిదారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజా కుమారి పాల్గొని సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐపిపిడి (ఏపిఎం) పద్మాలత, ఎల్‌హెచ్ (డిపిఎం) మధుసూదన్, ఎల్‌హెచ్(ఏపిఎం) నాగేంద్రప్రసాద్, నెల్లూరు రూరల్ మండల (ఏపిఎంసి) హెచ్ రోస్ మేరీ, డిఆర్‌పి భానుచంద్ర, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సుజాత, సిసిలు, అకౌంటెంట్లులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ స్ఫూర్తి.. ఆర్డీవో ఆదర్శం.. వినూత్న శుభాకాంక్షలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నూతన సంవత్సరం ఆరంభంనాడు మర్యాద పూర్వకంగా కలిసేవారు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలకు బదులుగా పుస్తకాలు,పేనాలు, జామెంట్రీబాక్సులు, ఇతర స్టడీమెటీరియల్ అందించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ఇచ్చిన పిలుపుమేరకు అదే బాటను అనుసరించిన ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని ఆదర్శంగా నిలిచారు. ఆమెను నూతనసంవత్సరం నాడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజప్రతినిధులు, నాయకులు, అధికారులు పుస్తకాలను, పేనాలను అందజేశారు. వివిద రకాల జనరల్‌నాలెడ్జిపుస్తకాలు, తరగతుల పాఠ్యపుస్తకాలను వారు అందజేసి ఆర్డీవోకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పుస్తకాలను శనివారం ఆర్డీవో స్తానిక ఎస్సీ హాస్టల్స్‌లోని విద్యార్తినీ, విద్యార్థినిలకు పంపిణీ చేశారు. విధుల నిర్వహణలో అత్యంత అంకితభావం, చిత్తశుద్ధిగా వ్యవహిరిస్తూ స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఉత్తమ ఆర్డీవోగా జిల్లాస్థాయి అవార్డును ఆమె అందుకున్నారు. దాంతోపాటు కలెక్టర్ పిలుపును స్వీకరించిన నూతన సంవత్సరం నాడు కానుకలకు బదులుగా పుస్తకాలను, ఇతర స్టడీమెటీరియల్‌ను స్వీకరించి వాటిని విద్యార్థులకు అందజేశారు. జిల్లా కలెక్టర్ ఆలోచనతో తాను జనవరి1వతేదీన పుస్తకాలను



స్వీకరించి పేద విద్యార్థులకు అందించడం అత్యంత సంతోషదాయకంగా ఉందని ఆర్డీవో పావని ఈసందర్భంగా పేర్కొన్నారు. పుస్తకాలను, పేనాలను అందించిన ఆర్డీవోకు సంబంధిత అధికారులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌సిసంక్షేమ, సాధికారిత అధికారిణి కె.శోభారాణి, ఏఎస్‌డబ్ల్యువో బ్రహ్మానందాచారి, వసతిగృహసంక్షేమాధికారి బి.పద్మనాభరెడ్డి, ఎస్‌సి బాలురవసతిగృహసంక్షేమాధికారిణి స్పందన, బాలికల వసతిగృహసంక్షేమాధికారిణి ఖాదరున్నీసా, సిబ్బంది పాల్గొన్నారు.

## మహనీయుల సేవలు మరువరానివి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మహనీయుల సేవలు మరువరానివని ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వి.మాధవరావు పేర్కొన్నారు. శనివారం స్కూల్లో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత పూలే చిత్రపటానికి పూలమాల వేసి నవాళులర్పించారు. అనంతరం పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయినిలందరిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాధవరావు మాట్లాడుతూ మహాత్ముల త్యాగాలు మరువలేనివన్నారు. సావిత్రీబాయిపూలే తొలిమహిళా ఉపాధ్యాయినిగా సమాజంలో ఎన్నో ఆటంకాలు ఎదురైనా మహిళా విద్యను ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో తెలుగుపండిట్‌లు మధుసూధనరావు, డాక్టర్ ఎం.ప్రసాద్, ఉపాధ్యాయినిలు లీలావతి, నాగరాజమ్మ, సబీనా, సీతామహాలక్ష్మి, అరుణమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సావిత్రీబాయిపూలే జయంతి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని గురుకుల బాలికల పాఠశాలలో శనివారం సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అతిథిగా హాజరైన రాష్ట్ర టిడిపి కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు దావా పెంచలరావు హాజరయ్యారు. ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయిపూలే తొలి మహిళా ఉపాధ్యాయిని అని, మహిళా విద్యను ప్రోత్సహించారని, ఆమె స్ఫూర్తితో బాలికలు విద్యాభ్యాసం గావించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పెంచలరావు పేర్కొన్నారు. ఉజ్వలభవిష్యత్తుకు సోపానం విద్య అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మెన్ బాలకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ రూతు, రిటైర్డ్ హెడ్మాస్టర్ పి.శ్రీరాములు, టిడిపి నాయకులు వెంకయ్య, చల్లా మాధవ, చెవుల వెంగయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాశిలామణి వైద్యశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మహిళలను విద్యావంతులుగా చేసేందుకు సమాజకట్టుబాట్లను కాదని సాహసాన్ని చేసి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరుపొందిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక మాశిలామణి వైద్యశాల నందు వైద్యాధికారి మాషి లామణి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఇవాళ అర్పించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు ఆమె చేసిన సాహసం ఈనాడు మహిళలు విద్యావంతులుగా ఎదిగి పురుషుల కంటే మిన్నగా అవకాశాలను అందిపుచ్చుకున్న పరిస్థితులు ఉన్నాయని ఆయన అన్నారు. అందుకే సావిత్రిబాయి పూలే కు ఆధునిక మహిళలు సదా కృతజ్ఞతలు తెలపాల్సి ఉందన్నారు. సమాజంలో సగభాగమైనా మహిళ విద్యలో కీలక పాత్ర పోషించిన సావిత్రిబాయి పూలేకు ప్రతి మహిళ రుణపడి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ నిన్న జాతి వర్గాలు ఆది వాసులు నిరక్షరాశులైన వారికి చదువుకు నోచుకోని ఇతర కులాల వారికి



తన భర్త ద్వారా చదువు నేర్చుకుని ప్రతి ఒక్కరూ గ్రామ పరిసరాలలో మురికివాడల్లో చదువు చెప్పి స్త్రీలందరినీ చైతన్యవంతులుగా చేసిన గొప్ప మహిళా మూర్తి అని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ హెప్సిబా శాలిని మల్లికార్జున కీర్తన ప్రేమలీల శాంతి కీర్తి విల్సన్ తిరుమలేశు విజయ్ సుజిత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# దేశంలో తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు లోని మినీ బైపాస్ రోడ్ లో గల జ్యోతిరావు పూలే సావిత్రిబాయి దంపతుల విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే గారి జయంతి సందర్భంగా జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు ఘటిస్తూ సావిత్రిబాయి భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, అమ్మాయిలకు చదువు అవసరం లేదని సమాజం భావించిన కాలంలో, అవమానాలు, రాళ్ల దాడులు ఎదుర్కొంటూ కూడా ఆమె చదువుజ్యోతి వెలిగించారు. చదువు లేకపోతే సమానత్వం లేదని ఆమె నమ్మారు. భర్త జ్యోతిరావు పూలేతో కలిసి బాలికల కోసం



పాఠశాలలు స్థాపించి, మహిళలు, బీసీలు, దళితులు గౌరవంగా జీవించేందుకు బాట వేశారు. సావిత్రీభాయి పూలే కేవలం ఉపాధ్యాయురాలు కాదు ఆమె ఒక మహిళా శక్తి. ఆమె చూపిన మార్గంలో నడవడమే ఆమెకు నిజమైన నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేందర్ రెడ్డి, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కర్నాట ఆంజనేయ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మామిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు ముక్కు రాధాకృష్ణ గౌడ్ మరియు జిల్లాస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తూర్పు చెన్నంపల్లి గ్రామంలో తహసిల్దార్ హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. శనివారం ఈ సర్వే పూర్తయిన పంచాయతీ పరిధిలో 50 మంది రైతులకు రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను మండల కన్వీనర్ మధుసూదన్‌రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల కోరిక మేరకు రాజముద్రతో ముద్రించిన రైతులకు భూ.. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఓటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదెల పవన్ పవన్ కళ్యాణ్ లు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గుర్రం గోపి, క్లస్టర్ ఇన్‌చార్జ్ పోకా మహేష్, టిడిపి నాయకులు బక్క అంతోని, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 14వ వార్డులో నూతన పైపులైను పనులకు శ్రీకారం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో 14వ వార్డు ముసునూరు శనివారం తాగునీటి సమస్య మరొక కీలక అడుగు ముందుకు పడింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతన పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. కావలి ఎమ్మెల్యే కావ్య ఆదేశాల మేరకు చేపట్టి పనులు వార్డు నాయకులు కలిసి కావున మున్సిపల్ కమిషనర్ శ్రవణ్ కుమార్ టెంకాయ కొట్టినంగా ప్రారంభించారు. అనంతరం కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే కావ్య ఆదేశాల మేరకు కావలి పట్టణంలో ప్రతి ఒక్క ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. దశలవారీగా పట్టణమంతా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ సాయిరాం మాజీ కౌన్సిలర్ ఉప్పు వెంకటస్వామి తెలుగుదేశం పార్టీ నాయకులు లింగం మాల్యాద్రి, బిట్రగుంట వెంకట్రావు, భోగ్యం కిషోర్, బత్తిన ప్రభాకర్, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హజరత్ అలీ పేరుతో అన్నదానం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మహమ్మద్ ప్రవక్త 'సల్లెల్లాహు అలైహి వ సల్లం' వారి సోదరులు అల్లుడు అయినటువంటి హజరత్ అలీ హైదర్ ఎ కర్రార్, అలీ షేర్– ఎ–ఖుదా, మౌలా అలీ వారి పుట్టినరోజు (విలాదతే మౌలా అలీ) సందర్భంగా శనివారం ఏఎస్ పేట మండల కేంద్రంలోని స్థానిక దర్గా సెంటర్ వద్ద గల రావి చెట్టు వద్ద స్థానిక ముస్లిం సోదరులు ప్రత్యేక అన్నదానం ఏర్పాటు చేసి పేదలకు పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమం సందర్భంగా మౌలానా తహసీన్ రజ ప్రత్యేక ఫాతిహాలు చదివి దువా చేశారు. పెద్ద ఎత్తున అన్నం స్వీట్ పంచారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు సయ్యద్ సందాని భాష, సయ్యద్ రషీద్ అహ్మద్, షేక్ రహమత్ నవాజ్ ముస్లిం యువకులు సయ్యద్ సాజిద్, సయ్యద్ మునీమ్, ఎం.రియాజ్, ఆఫ్రిద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.మాలకొండయ్య ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయురాలను సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మన దేశం మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని 1931 సంవత్సరాలలో మహిళ చదువుల కోసం పోరాడిన మహనీయురాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెంగాళమ్మ ఆలయానికి వేమిరెడ్డి దంపతుల భారీ విరాళం

- నిత్యాన్నదానానికి 6 లక్షలు అందజేత.
- అమ్మవారి ఆలయంలో ఛండీయాగం నిర్వహణ
- ప్రజలందరిపై అమ్మవారి ఆశీసులు మెండుగా ఉండాలి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** దైవ కార్యక్రమాలకు తనవంతు అండగా నిలిచే నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు మరోసారి తమ ఉదారతను చాటుకున్నారు. శనివారం సూళ్ళురుపేటలో కొలువై ఉన్న చెంగాళమ్మ అమ్మ వారిని దర్శించుకున్న వారు.. అమ్మవారి ఆశీసులు అందుకున్నారు. ఆల యంలో చేపట్టిన ఛండీయాగంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చ కులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి వేదాశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.6లక్షలు విరాళం అంద జేశారు. ఈ మేరకు చెక్కును ఆలయ సహాయ కార్యదర్శి ప్రసన్న లక్ష్మి అంద జేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. ఆరుద్రనక్షత్రం పౌర్ణమి సందర్భంగా అమ్మవారి ఆలయంలో చండీ యాగం నిర్వహించామన్నారు. అమ్మవారిని దర్శించు కుని ఆశీసులు అందుకున్నామన్నారు. అలాగే అన్నదానానికి 6లక్షలు అందజేశామని తెలి యజేశారు. ఈ నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలకు, జిల్లా, కోవూరు ప్రజ లకు అమ్మవారి ఆశీసులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు బెజవాడ వంశీరెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# కార్యదర్శులు విధిగా భవనాల తనిఖీ చేయాలి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 45వ డివిజన్ పొగతోట ప్రాంతంలోని వివిధ ఆసుపత్రులను అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఆసుపత్రులను కమిషనర్ సందర్శించి భవనానికి సంబంధించి ప్లాన్ అప్రూవల్ కాపీ, ప్రాపర్టీ టాక్స్, ట్రేడ్ లైసెన్స్ లను తనిఖీ చేశారు. అనుమతులను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాలకు బీపీఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకునేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు నిర్వహిస్తున్న భవనాల యజమానులకు బీపీఎస్ పథకంపై అవగాహన కల్పించేలా కమిషనర్ కరపత్రాలను పంచి పథకం యొక్క ఉపయోగాలను వివరించారు. ఈ సందఠరేగా కమిషనర్ మాట్లాడుతూ ఆసుపత్రులను నిర్వహిస్తున్న అన్ని భవనాలను తప్పనిసరిగా తనిఖీలు చేసి అనుమతులు అతిక్రమించిన భవనాలను బీపీఎస్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు అంతా విధిగా తమ పరిధిలోని భవనాలను తనిఖీ చేసి వాటికి నిర్మాణ అనుమతులు, అసెస్మెంట్ డిమాండ్, ట్రేడ్ లైసెన్స్‌లను పరిశీలించి అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నుల పండువగా రుక్మిణి కల్యాణోత్సవం

- భారీగా తరలివచ్చిన భక్తులు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక తిరుమల, తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్పీల ఆధ్వర్యంలో శనివారం హిందూ సమ్మేళ నాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మ శ్రీశ్రీశ్రీ రామా యణంమహేష స్వామి, ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్‌లు భక్తులకు సందేశాన్నిచ్చారు. అనంతరం వేదపండితుల మంత్రో చ్ఛరణాల నడుమ శ్రీకృష్ణుడు, రుక్మిణిదేవి, సత్యభామ దంపతుల కల్యాణో త్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి కల్యాణాన్ని కను లారా తిలకించి పులకించిపోయారు. తొలుత స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ట్యాంక్ బండ్, మెయిజన్ బజార్, శివాలయం మీదుగా మేళతా ళాలు, బాణసంచా పేలుళ్లు, కోలాట నృత్యాల నడుమ స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకరథంలో ప్రతిష్టించి కల్యాణ మండపానికి చేర్చారు. కల్యాణం అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో ప్రతిష్టించి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు స్వామివారి వాహనం వెంట వారుకడవతో నీరుపోసి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణం తోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. జెండాలు, తోరణాలతో పట్టణం కాషాయమయమైంది. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోబాలకృష్ణ రెడ్డి, సుమంగళి శ్రీను, నారాయణ రెడ్డి, మన్నేటి శ్రీను, విప్లవ, ప్రసాద్, ఆర్ఎస్ఎస్, బీజేపీ, వీహెచ్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరుద్రోత్సవం పరమశివుని జన్మ నక్షత్ర వేళ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శనివారం ఆరుద్ర నక్షత్రం కావడంతో వేకువ జాము నుండి శివాలయాలకు పోటెత్తిన భక్తులు శివ ముక్కోటి (ఆరుద్రోత్సవం)గా జరుపుకుంటున్నారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర ఆలయంలో వేకువ జామున స్వామి వారికి విశేషంగా అభిషేకాలు జరిగాయి. అభిషేక కార్యక్రమానికి ఇన్‌చార్జ్ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కార్యనిర్వహణాధికారి అర్వ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, గత కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్, భక్తులు పాల్గొన్నారు. శివముక్కోటిగా పిలువబడే ఆరుద్ర దర్శనం ధనుర్మాసంలో వచ్చే శుక్లపక్ష చతుర్ధశి లేదా పౌర్ణమి నందు వచ్చు ఆరుద్ర నక్షత్రం పర్వదినాన శ్రీ శివకామసుందరి సమేత నటరాజస్వామికి వేకువజామున 4 గంటలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రం ప్రారంభించి అత్యంత వైభవంగా విశేష అభిషేక ద్రవ్యాలతో అభిషేకం జరిగింది. తదుపరి ఉదయం 7 గంటలకు ఆలయ మహాద్వారం స్వామి వారి ఆరుద్ర దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆరుద్రోత్సవ పర్వదినాన్ని శ్రీ మూలస్థానేశ్వర స్వామి వారికి ఉదయం 10 గంటలకు వేదపండితులచే రుద్ర పారాయణ సహిత అన్నాభిషేకం, స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన నాట్యం, నాధం గానాలతో స్వామి వారికి గంట మండపంను జరిపారు. ఈ ప్రీతికరమైన అన్నాభిషేక దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

## రాష్ట్ర మాజీమంత్రి కాకాణికి సన్మానం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నేలటూరు గ్రామ సర్పంచ్ భక్తాని కనకయ్య శనివారం ఆత్మీయ సన్మానం చేశారు. పార్టీ కార్యకర్తలు మౌలాలి, గ్రామస్తులతో కలిసి రాష్ట్ర మాజీ మంత్రికి పూలమాల వేసి శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది. మాజీ మంత్రికి సర్పంచ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ సెల్ఫీ బూత్ ప్రారంభం




**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో శనివారం స్వచ్ఛ సర్వేక్షన్ 2026లో భాగంగా కావలి పురపాలక సంఘం కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలను పారిశుద్ధ్యం ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ సర్వేక్షన్‌పై ప్రజలను చైతన్య పరిచేందుకు స్వచ్ఛ సెల్ఫీ బూత్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కావలి పట్టణ ప్రజలకు స్వచ్ఛ సర్వేక్ష పై అవగాహన కార్యక్రమాన్ని రైతు బజార్ సెంటర్లో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కావలి ఒకటో పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి ఆలయంలో ఆరుద్రోత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడలో వేంచేసియున్న శ్రీ మల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానం నందు స్వామి వారి జన్మ నక్షత్రం 'ఆరుద్ర' సందర్భంగా శని వారం శ్రీ శివకామ సుందరి సమేత శ్రీ తాండవేశ్వర స్వామి గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీ స్వామి వారి రుద్రపాదుకులకు (శఠారి) పంచామృత అభిషేకములు, సహస్రనామార్చన పూజలు దేవస్థాన అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి శ్రీ స్వామి వారి శఠారి ఆశీర్వచనం, పంచామృత ప్రసాదం భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధి కారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోన క్షేత్రంలో కల్యాణ మహోత్సవం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సందర్భంగా శని వారం తెల్లవారుజామున 4 గంటలకు శ్రీస్వామివారికి అభిషేకం ఉదయం 10.30 గంటలకు శ్రీవార్ల కళ్యాణోత్సవం, సాయంత్రం 5.30 గంటలకు చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మి సమేత నరసింహస్వామివారికి తిరుచ్చి పల్లకిసేవ ప్రధానార్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో మంగళవాయిద్య, గిరిజనుల వాయిద్య నడుమ సహస్ర దీపాలంకరణసేవ తదితర సేవలు అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని దేవస్థానం ఉప కమీషనర్అండ్ కార్యనిర్వ హణాధికారిపొరెడ్డి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పర్యటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శిం చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి కళ్యాణ మహో త్సవానికి హాజరైన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండ క్యూలైన్ల ఏర్పాట్లు, మంచినీటి సరఫరా, అన్నదానం తదితర కార్యక్రమాలను ఉప కమిషనర్ అండ్ కార్యనిర్వ హణాధికారి పర్యవేక్షించారు.

## రంగడికి వైభవంగా రాపత్తు ఉత్సవం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** రంగనాయకులపేటలో వెలసియున్న తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో శనివారం రాపత్తు ఉత్సవం వైభ వంగా జరిగింది. ఉదయం ధనుర్మాసం పూజలు, తిరుప్పావై సేవాకాలం, శాత్తు ముర్రై, విశేష పూజలు జరిగాయి. రాపత్తు ఉత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి ఉత్తర ద్వారం గుండా విచ్చేశారు. అనంతరం రాత్రి ప్రాకార ఉత్సవం జరిగింది. ఆలయ కార్యనిర్వహణా ధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.